

బాలికకు వేధింపులు 7
» రాజోలులో ఐదుగురిపై పోక్సో కేసు

ఇసుక అక్రమ తవ్వకాలకు యత్నం 7
» లంకల గన్నవరంలో రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు లారీలు స్వాధీనం



కామనగరువు మండల పరిషత్ పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా
మెగా పీటీఎం

» కలెక్టర్ మహేష్‌కుమార్
» జిల్లాలో 13 జూనియర్ కళాశాలలు, 1582 పాఠశాలల్లో కార్యక్రమం

అమలాపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సంస్కరణలకు అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా మెగా పీటీఎం సమావేశాలు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించారని కలెక్టర్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు చేపట్టిన విద్యారంగ సంస్కరణలతో రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,పాఠశాలల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తామన్నారు. కామనగరువు పంచాయతీ పరిధిలోని పితానివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎంకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలల్లో నేర్చుకున్న పాఠాలపట్ల ఎంతమేరకు అవగాహన కలిగి ఉన్నారో స్వయంగా పరీక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సత్సంబంధాలతో మెలగాలన్నారు. జిల్లావ్యాప్తంగా 1582 పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం -3.0 నిర్వహించామన్నారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి నివేదికల హోలిస్టిక్ ప్రోగ్రెస్‌కార్డులపై ముఖాముఖి చర్చలు నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రోగ్రెస్ కార్డుల ద్వారా విద్యార్థుల మార్కులు తెలుసుకోవడంతోపాటు వారి శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగ సామర్థ్యాలు వంటి వన్నీ నమోదు చేస్తామని, వాటి ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, వారి ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కార్యక్రమం నిర్వహించారు.

డీఈవో షేక్ సలీంబాషా మాట్లాడుతూ మెగా పేరెంట్-టీచర్‌మీట్‌ద్వారా పాఠశాలల విద్యాప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల భాగస్వామ్యం మరింత విస్తృతమవుతుందన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, సర్పంచ్ నక్కా అరుణకుమారి, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం, విద్యాశాఖ అధికారులు, స్కూలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కామనగరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంకు జేసీ టి. నిషాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎం చక్రధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ ప్రభావానికి లోనుకాకుండా చదువుపై శ్రద్ధవహించాలన్నారు.చదువుతోపాటు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, క్రీడా రంగాలకు ప్రాధాన్యమిస్తూ సమగ్ర ప్రగతి సాధించాలన్నారు. జడ్పీటీసీ శ్రీహరిరాంగోపాల్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, మహేష్, ఎస్ఎంసీ వైస్‌చైర్మన్ వెంకటరమణ పాల్గొనగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



మెగా పీటీఎంలో విద్యార్థులతో కలిసి ఆల్ ది బెస్ట్ చెప్తున్న జేసీ నిషాంతి

పుష్కర.. గోదారి!



రాజమహేంద్రవరంలో గత పుష్కరాలకు నిర్మించిన అతిపెద్ద కోటిలింగాల ఘాట్

ఇప్పటి నుంచే పుష్కర సన్నాహాలు

» 2027లో గోదావరి పుష్కరాలు
» కోట్లాది మంది భక్తుల అంచనా
» మరిన్ని ఘాట్లకు ప్రతిపాదనలు
» ప్రజాప్రతినిధుల అంచనాలు
» కాకినాడలో 10 ఘాట్లు
» ఉమ్మడి జిల్లాలో పుష్కర సందడి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

2027 గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.12 ఏళ్లకోసారి వచ్చే గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించనున్నారు. కోట్లాది మంది భక్తులు తరలి వచ్చే పుష్కర స్నానాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గోదావరి వెంబడి స్నానపు ఘాట్లను భారీస్థాయిలో సిద్ధం చేస్తోం ది. ఒకేసారి లక్షలాది మంది స్నానం చేసేలా ఘాట్లను తీర్చిదిద్దనున్నారు.పుష్కర స్నానాలు రాజమహేంద్రవరం, కొవ్వూరులో అత్యధికంగా జరగనుండగా ఆ తర్వాత కాకినాడ, కోనసీమ జిల్లాల్లో జరగనున్నాయి.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్

కాకినాడ, కోనసీమల్లో..

కాకినాడ జిల్లాలో పది ఘాట్లను రూ.5 కోట్లతో సుందరీకరించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. పదిలో కాజులూరు మండలంలో రెండు, తాళ్లరేవు మండలంలో 8 ఘాట్లను ముస్తాబు చేయాలని నిర్ణయించింది. ఒక్కో ఘాట్ 15 నుంచి 30 మీటర్ల మేర పొడవుతో నిర్మిస్తోంది. కాజులూరు మండలం పెద్దలంక, అంద్రంగి, తాళ్ల రేవు మండలం పిల్లంక, గోపుల్లంక, గోవలంక వద్ద 20 మీటర్ల పొడవైన ఘాట్ల ను ఆధునికీకరిస్తోంది.కొత్తగా ఇంజరం, పిల్లంక వద్ద కొత్తలంక పరిధి , తాళ్లరేవు పట్టణం ఐత్రీయ కోరంగి బ్రాంచి వద్ద నందిరేవులో కొత్త స్నానపు ఘాట్‌ను నిర్మించనున్నారు. కోరంగిలో శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద గోదావరిని ఆనుకుని మరో ఘాట్ నిర్మించనున్నారు. తాళ్లరేవు మండలంలో సిద్ధం చేస్తోన్న ఎనిమిది ఘాట్లకు కాకినాడతో పాటు కోనసీమ జిల్లా నుంచి భారీగా పుష్కర స్నానాలకు భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అఖండ గోదావరి నది సముద్రంలో సంగమించే చివరి ప్రాంతం తాళ్లరేవు, యానాం కావడంతో పుష్కర స్నానాలకు భక్తులు ఇక్కడకు భారీగా వస్తారని భావిస్తు న్నారు.పైగా గోదావరి మూడు పాయలు కలిసే ప్రాంతం ఇక్కడే కావడంతో సెంటిమెంట్‌గా భావించి స్నానాలకు ఇక్కడకు వచ్చే వారు లక్షల్లో ఉంటారని లెక్కలేస్తున్నారు. 2015 పుష్కరాల్లో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గోదావరి మూడు పాయలు కలిసే యానాం సమీపంలో పుష్కర స్నానం ఆచరించడంతో ఇక్కడ స్నానమాచరిస్తే మరింత పుణ్యం వస్తుందని ప్రచారం జరిగి అప్పట్లో లక్షల్లో పోటెత్తారు. దీంతో ఈసారి కూడా ఎంత రద్దీ వచ్చినా తట్టుకునేలా ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కోనసీమలో కోటిపల్లి, కపిలేశ్వర పురం, యానాం, నగరం, అప్పనపల్లి, ముక్తేశ్వరం, మురమళ్ల, కుండలేశ్వరం, కొత్తపేట, జొన్నాడ, రావులపాలెం తదితర ప్రాంతాల్లో ఘాట్లు ఉన్నాయి. ఈ జిల్లాలో కూడా ఘాట్లు పెంచే యోచనలో ఉన్నారు.

రాజమహేంద్రవరంలో ఒకే ఘాట్ అయ్యేనా?

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 2027లో జరిగిన గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి తగ్గట్టుగా స్నానాల రేవుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గత నెలలో మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అధికారులు, ఎమ్మెల్యేలతో నూతన ఘాట్లు, ఘాట్ల అనుసంధాన ప్రక్రియపై చర్చించారు.రాజమహేంద్రవరంలో గౌతమి ఘాట్ మొదలుకొని పుష్కరాల రేవు వరకూ ఘాట్లను అనుసంధానం చేసే ప్రక్రియపై ప్రతిపాదనలు ఉన్నాయి.ఈ ఘాట్లు కలుపుతారా విడివిడిగా అభివృద్ధి చేస్తారా అనేది తేలాల్సి ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో నాల్గో బ్రిడ్జి కింద నుంచి రెండు అతిపెద్ద వీఐపీ ఘాట్లను నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. రాజానగరం నియోజకవర్గం బొబ్బిల్లంక, మునికూడలి ప్రాంతాల్లోనూ ఘాట్లు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

కొవ్వూరులో ఇలా..

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.135.50 కోట్లతో 53 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో 8 రేవులు 1.2 కిలోమీటర్లు మేర రూ.90 కోట్లతో ఒకే ఘాట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఘాట్లను భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తరించడంతో, మరి కొన్ని కొత్తఘాట్లను ప్రతిపాదించారు. కొవ్వూరు పట్టణ, మండలంలో పాతవి 20, కొత్తవి 8, తాళ్లపూడి మండలంలో పాతవి 8, కొత్తవి 2, నిడదవోలు పట్టణ, మండలంలో పాతవి 3, కొత్తవి 2, పెరవలి మండలంలో పాతవి 7, కొత్తవి 3 ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు.నిడదవోలు మండలం విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు గోదావరి ఏటిగట్టు రహదారి సుమారు 30 కి.మీ రూ.70 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెప్పారు

మధురపూడి ఎయిర్‌పోర్ట్



అదిగో..ఇండిగో..
వచ్చేస్తోంది!

» ఆకాశంవైపు చూపులు
» ఎంతకీ రాని విమానాలు
» పలు విమానాలు రద్దు
» ప్రయాణికుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వియాన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. విమానాలు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఎప్పుడు విమానం వస్తుందో ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఇండిగో విమాన పైలెట్ల రెస్ట్ విషయంలో ఏర్పడిన వ్యవహారంతో కొన్ని విమానాలు రద్దవడంతోపాటు కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో అనేక మంది ప్రయాణాలు మానుకోగా.. మరికొందరు విమానాశ్రయాల్లో వేచి చూస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి అనేక మంది న్యూఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు ప్రతిరోజూ వందలాదిమంది విమానాల్లో ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం ఇండిగో విమాన సంస్థలో ఏర్పడిన సమస్యతో సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. పైలెట్ల కొరత తెరమీదకు వచ్చింది. ఇండిగో యాజమాన్యం పైలెట్లకు విశ్రాంతి ఇవ్వడంలేదని సమాచారం బయటకు రావడంతో ఎయిర్‌పోర్టు అథార్టీ పైలెట్లకు విశ్రాంతి తప్పనిసరి చేసినట్టు సమాచారం. దీంతో పైలెట్ల కొరత ఏర్పడి విమానాలు రద్దవుతున్నాయి. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టునుంచి ప్రతి రోజూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి, న్యూఢిల్లీ 11 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తిరుపతికి రోజు విడిచి రోజు ఒక విమానం వెళ్తోస్తుంది. కానీ గురువారం నుంచి ఆకస్మికంగా విమానాలు రద్దవడం, ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి ముంబయి వెళ్లాల్సిన 160మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలో జాగరణ చేశారు. రాత్రి 8.30 గంటలకు రావాల్సిన ముంబయి విమానం శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు వచ్చింది. తిరిగి ఐదు గంటలకు వెళ్లింది. ఎయిర్‌పోర్టు, విమాన సంస్థ అధికారులు కొందరు ప్రయాణికులకు రాజమహేంద్రవరంలో హోటల్ రూమ్‌లు బుక్ చేయగా కొందరు ఇళ్లకు వెళ్లి వచ్చారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ఇక శుక్రవారం న్యూఢిల్లీ, ముంబయి విమానాల సర్వీసు రద్దయింది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి రావాల్సిన విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. బెంగళూరు నుంచి శుక్రవారం ఉదయం రావాల్సిన విమానం అర్ధరాత్రి 12 గంటలకు రావొచ్చని అధికారులు చెబుతున్నారు.దీంతో సుమారు 70 మంది ప్రయాణికులు ఈ రాత్రి కూడా ఎయిర్‌పోర్టులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై విమానం శుక్రవారం రావాల్సి ఉండగా శనివారం రానున్నట్టు సమాచారం. గురువారం 670మంది ప్రయాణం చేయగా.. శుక్రవారం బాగా తగ్గడం గమనార్హం.



పచ్చళ్ల తయారీ విధానంపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ మహేష్‌కుమార్

డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా వృద్ధి చెందాలి

» జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
» నార్కెడిమిల్లిలో పచ్చళ్ల తయారీ కేంద్రం పరిశీలన

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డ్వాక్రాసంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆకాంక్షించారు. ఆత్రేయపురం మండలంలోని నార్కెడిమిల్లిలో శుక్రవారం ఆ డ్వాక్రా సంఘ మహిళలు నిర్వహిస్తున్న పచ్చళ్ల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ముడిసరుకు, తయారీ విధానం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మామిడికాయ పచ్చడి తయారు చేస్తున్న విధానాన్ని ఆరాతీశారు. ఇక్కడ తయారు చేస్తున్న పచ్చళ్లను ఏఏ ప్రాంతాల్లో అమ్మకాలు నిర్వహిస్తున్నారో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తయారీలో పరిశుభ్రత పాటిస్తూ రుచితోపాటు నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. వ్యాపార నిర్వహణకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉంచుకోవాలన్నారు. పచ్చళ్ల ఎగుమతుల్లో వివిధ చెక్‌పోస్టుల వద్ద ట్యాక్స్‌ల పేరుతో వేధింపులకు గురవుతున్నట్లు మహిళలు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డిప్యూటీ తహశీల్దారు శ్రీరామచంద్రమూర్తి, వెలుగు ఏపీఎం గంగాధర్, ఆర్‌ఐ భాను, డిప్యూటీ ఎంపీడీవో రాజు పాల్గొన్నారు.

ఆక్వాసాగుపై తెగుళ్ల దాడి

» రొయ్యి ధర పెరుగుదలతో రైతులకు కాస్త ఊరట

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు డాలర్ల పంట పండించిన ఆక్వారంగం నేడు వరుస తెగుళ్లతో ఆక్వా రైతులను కుదిపేస్తోంది. ఆక్వాసాగులో విబ్రో వైరస్ వంటి తెగుళ్ల వరుస దాడులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోనసీమ తీర మండలాల్లో ఆక్వాసాగు జోరుగా సాగవుతోంది. ఆక్వా రైతులకు హేచరీల ద్వారా నాణ్యమైన రొయ్య విత్తనం లభించక, వాతావరణ పరిస్థితులు అనుకూలించక రొయ్యలు తెగుళ్ల బారిన పడి నష్టాలు చవిచూస్తున్నారు. వరిసేద్యం అనుకూలించకపోవడంతో చాలామంది రైతులు ఆక్వా సాగుపై దృష్టిసారించారు. ఆక్వా పంట బాగుంటే ధర లేక, ధర పెరిగినప్పుడు దిగుబడులు తగ్గి, మేతల ధరలు పెరిగి ఆక్వా రైతులు నష్టాల నీడలోనే సాగుచేస్తున్నారు. మేతల ధరలు, తెగుళ్ల మందుల ధరలు, చెరువుల లీజులు పెరిగి సాగు మానలేక కష్టాలతోనే కొనసాగిస్తున్నారు. ఆక్వా రొయ్య పిల్లలు ఉత్పత్తిచేసే హేచరీలు చాలా వరకు మూతపడ్డాయి. అల్లవరం మండలంలోనే 12 హేచరీల వరకు మూసివేశారు. ఆక్వా రైతులకు క్వాలిటీ సీడ్ అందక తెగుళ్లు వ్యాపిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క ధర పెరుగుదలతో ఆక్వా రైతులు కాస్తంత ఊరట చెందుతున్నారు. వంద కౌంట్ రొయ్యలు రూ.250, 50 కౌంట్ రూ.350, 40 కౌంట్ రూ.380, 30 కౌంట్ రూ.450 ధర పలుకుతున్నాయి.

నాణ్యమైన సీడు అందించాలి
-పంపిరెడ్డి కాశీ, ఆక్వారైతు, గూడాల



ఆక్వారైతులకు నాణ్యమైన రొయ్యసీడు అందేలా చర్యలు తీసుకోవాలి.మందుల ధరలు తగ్గించి ఆక్వా రైతులకు సబ్సిడీ మరింత పెంచితే బాగుంటుంది. విబ్రో వైరస్ వంటి తెగుళ్ల వల్ల నష్టాల్లో కూరుకుపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి
-కాశీవిశ్వనాథరాజు, ఆక్వారైతు, గోడిలంక



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పెంచి ఆదుకోవాలి. రొయ్యల మేతలు తగ్గేలా చర్యలు చేపట్టాలి. రైతు పంట పండే సమయంలో ధర పెరిగేలా చూడాలి. వ్యవసాయం సరిగా లేకపోవడంతోనే రైతులు ఆక్వాపై దృష్టిసారించారు.



అల్లవరంలో పట్టుబడిన రొయ్యలు

సాయుధ దళాల పతాక దినోత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సైనిక్‌బోర్డు చైర్మన్, కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరుపుకున్నారు. దేశరక్షణకు సాయుధదళాల కృషిని, వారి త్యాగాలను స్మరించుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి నవాబ్‌జాన్ పాల్గొన్నారు.

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణంపై కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ

ఆలమూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ముందుకు సాగేలా చూడాలని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ కోరారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీ ఆయన్ను కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీతోనైనా ఫ్లైఓవర్ నిర్మాణం ముందుకు వెళ్తుందా.. అని చర్చ జరుగుతోంది.

జిల్లాలోని ఆలమూరు మండలం జొన్నాడలో 216ఏ హైవేపై జొన్నాడ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఏడాదిన్నర కాలంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నిర్మాణం ముందుకు కదలడంలేదు. దీనిపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీ హరీష్, కలెక్టర్ మహేష్ కాంట్రాక్టర్‌తో మాట్లాడినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రజల ఇబ్బందులను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా కాంట్రాక్టర్‌ను మార్చి పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి గతనెల 5న ఆర్డీవో శ్రీకర్ సమక్షంలో పనులు అప్పగించారు. నెలరోజులు గడిచినా పనుల్లో మార్పు రాలేదు. పాత కాంట్రాక్టర్‌ను రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంలో అనేక అవరోధాలు ఉన్నట్లు తెలుస్తోంది. పాత కాంట్రాక్టర్ పిల్లర్లు నిర్మించి గెడ్డర్లు సిద్ధం చేయడంతోపాటు అప్రోచ్‌కు సిద్ధం చేశారు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై అభ్యంతరాలు రావడంతో పనులు ప్రారంభం కాలేదని తెలుస్తోంది.





కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్, పిల్లర్లకే పరిమితమైన జొన్నాడ ఫ్లైఓవర్

'ఇసుక తవ్వకాలు పారదర్శకంగా నిర్వహించాలి'

అమలాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుక పాలసీకి అనుగుణంగా ఇసుక తవ్వకాలు, రవాణా, పంపిణీ ప్రక్రియలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా ఇసుకను సరఫరా చేయాలని, జిల్లాస్థాయి శాండ్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన సూచించారు. ప్రస్తుత ఇసుక నిల్వలు, ఇప్పటివరకు నిర్వహించిన లావాదేవీలు, ఆన్‌లైన్ బుకింగ్, రవాణా నియంత్రణ, అక్రమ తవ్వకాలపై చర్యలు వంటి అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. మ్యాప్‌ల ఆధారంగా ఇసుక నిల్వలున్న ప్రాంతాలను గుర్తించారు. భవన నిర్మాణ రంగాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలు, చట్టాల ప్రకారం సక్రమంగా చర్యలు తీసుకోవడమే కమిటీ ధ్యేయమన్నారు. ఇసుక నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. నిల్వలను సమీక్షించి అనుమతులతో కొనసాగుతున్న తొమ్మిది ఇసుక రీచ్‌లను ఈనెల 15నుంచి తవ్వకాలు పునఃప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని నిర్మాణ, భవన కార్మికుల ఉపాధి నిరంతరాయంగా కొనసాగించేలా ఇసుక సరఫరా చేయాలన్నారు. ఇసుక నిల్వలను గుర్తించి పరిశీలించిన బృందాలు ఏస్థాయిలో ఇసుక నిల్వలున్నాయోపర్య వేక్షించాలన్నారు. జేసీ నిషాంతి, గనులు, భూగర్భశాఖ ఏడీ వంశీధర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీర్ రాము, భూగర్భజలశాఖ ఏడీ ప్రత్యూష, ఆర్డీవో శ్రీనివాసరావు, డీపీవో శాంత లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రాజన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్



పోలీసు శాఖకు వెన్నెముక

నేడు హోంగార్డ్స్ రైజింగ్ డే

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు వెన్నెముక హోంగార్డు వ్యవస్థ. హోంగార్డ్స్ రైజింగ్ డేను ప్రతిఏటా డిసెంబరు 6న జరుపుకుంటారు. 1946లో ముంబయిలో జరిగిన మతపరమైన అల్లర్లను నియంత్రించడానికి పోలీసులకు సహకరించేందుకు తొలుత హోంగార్డులను తీసుకున్నారు. అప్పుడు ఏర్పడిన ఈ వ్యవస్థ శాంతి భద్రతల పరిరక్షణ, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో కీలకమైంది. హోంగార్డుల గుర్తించడం, వారికి గౌరవ మర్యాదలు కల్పించడం, అత్యవసర సమయాల్లో వారి పాత్రను తెలియచెప్పడం వంటివి రైజింగ్ డే ముఖ్య ఉద్దేశ్యం. గతంలో హోంగార్డులను స్వచ్ఛంద రక్షణ దళం అనేవారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, శాంతిభద్రతలు అదుపు తప్పినప్పుడు కానిస్టేబుల్ కన్నా ముందు హోంగార్డు నిలబడతాడు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1000 మంది హోంగార్డులు ఉండగా వారిలో 400 మంది మహిళే కావడం గమనార్హం. వారి పాత్ర ఎంతో కీలకం. అయితే వారికి వేతనాన్ని ఇప్పటికీ రోజువారీ కూలి మాదిరిగానే ఇస్తున్నారే తప్ప సేవలకు తగ్గ ఫలితం ఉండట్లేదు. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నా జీతం రూ.25 వేలకు మించి లేదు. మహిళా హోంగార్డులకు కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తినా చికిత్స చేయించుకునేందుకు ఎటువంటి రాయితీలూ లేవు. ఉన్నతాధికారులు తమకు క్షేత్రస్థాయిలో సంరక్షణ అందించగలిగితేనే నిజమైన రైజింగ్ డే అని హోంగార్డులు చెప్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)





బంగారం, వెండి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.. ఏ మాయ జరుగుతోందో కానీ వీటి ధరలు వెనక్కి తిరిగి చూడట్లేదు. వచ్చే ఏడాది మరింత పెరిగే అవకాశముందని బంగారం వ్యాపార నిపుణుల అంచనా. ఈ ఏడాది జనవరిలోనే కళ్లు తిరిగేలా ధరలు పెరిగాయి. అయితే ధరలు పెరిగే కొద్దీ కొనుగోళ్లు కూడా పెరుగుతుండడం గమనార్హం. జనవరి నుంచి క్రమంగా పెరుగుతున్న బంగారం... ఇటీవల వరలక్ష్మీ పూజ, వినాయ చవితికి పెరుగుతూ వచ్చి, దసరా సమయంలో మరింత పెరిగిపోయింది. అక్టోబరు, నవంబరుల్లోనూ కూడా బాగా పెరిగింది. ఈ నెల ప్రారంభంలో మరింత దూసుకుపోతోంది. బంగారం ధర 22 క్యారెట్ ఒక గ్రాము రూ.11,980గా ఉంది. ఇది రూ.12వేలకు చేరుతుందనే అంచనా ఉంది. 10 గ్రాముల ధర 1,19,800 ఉంది. 24 క్యారెట్ ఒక గ్రాము ధర 13,069. ఈ ఏడాది ఇదే రికార్డు ధర. 10 గ్రాముల ధర రూ.1,30,690కు చేరింది.

ఇక ఈ ఏడాది జనవరి 1న 22 క్యారెట్ 10 గ్రాముల ధర కేవలం రూ.71,150గా ఉంది. 11 నెలల తర్వాత రూ.1,19,800 అయ్యింది. అంటే ఏకంగా 48,650 పెరిగింది.

24 క్యారెట్ ధర జనవరి 1న రూ.78వేలు మాత్రమే ఉంది. ఇవాళ రూ.1,30,690కి చేరింది. అంటే ఏకంగా 52,690 పెరిగింది. సుమారు 11 నెలల వ్యవధిలో బంగారం ధరలు ఇంత రికార్డు స్థాయిలో పెరడం బులియన్ మార్కెట్ చరిత్రలో ఇదే మొదటిసారి.

జనవరిలో బంగారం కొనుగోలు చేసిన వారికి బాగా లాభం వచ్చినట్టే.

వెండి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. జనవరిలో కిలో రూ.88,400 కాగా ఇవాళ సుమారుగా రెట్టింపు దాటి పెరిగిపోయింది. బుధవారం రూ.1.84 లక్షలు, గురువారం రూ.1.82 లక్షలు కాగా శుక్రవారం కాస్త తగ్గి రూ.1.79 లక్షలకు దిగింది. కానీ మళ్లీ పెరిగిపోయే అవకాశాలున్నాయని చెప్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు పెరిగింది 120శాతం వరకు ఉండడం గమనార్హం. వెండి ధర రూ.2లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వెండి కిలో బార్లకు, నాణేలకు బాగా డిమాండ్ పెరిగింది.

బంగారం, వెండి ధరలు క్రిస్మస్, సంక్రాంతికి మరింతగా పెరిగిపోతాయేమోనన్న ఆందోళన ఉంది. ప్రస్తుత ధరలు వ్యాపారులకు లాభాలు తెస్తుండగా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. సంపన్నవర్గాలకు పెట్టుబడి సాధనంగా ఉంది.

చుక్కలనంటిన బంగారం ధరలు
22 క్యారెట్ 10 గ్రాములు
రూ.1,19,800
24 క్యారెట్ 10 గ్రాములు
రూ.1,30,690
వెండి కిలో రూ.1.79 లక్షలు



శీతాకాలం ప్రారంభమైంది. ఉషోదయవేళ దారులన్నీ మంచు దుప్పటి కప్పుకుంటున్నాయి. సాయంత్రం వేళ శీతలగాలులు అంతర శరీరాన్ని కుదిపేస్తున్నాయి. దగ్గు, జలుబు పట్టిపీడిస్తున్నాయి. నవంబరు నెల నుంచి ఏటా జరిగే తంతే ఇదంతా. సమశీతోష్ణ స్థితికి అలవాటుపడిన శరీరానికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను తట్టుకోవడం కాస్త ఇబ్బందికరమే. వీటి నుంచి గట్టెక్కేందుకు ఏకైక మార్గం స్వెట్టర్ ధరించడమే.

వెచ్చని నేస్తాలు







- ప్రజలను వణికిస్తున్న చలి
- సాయంత్రం ఐదు గంటల నుంచే శీతలగాలులు
- ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్
- ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి విక్రయం

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

చలికాలం ప్రారంభమైంది. బయటకు రావడానికి భయపడేలా ప్రజలను చలి వణికిస్తోంది. వారం రోజులుగా చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. సాయంత్రం ఐదు గంటలకే చల్లటి గాలులు ప్రారంభమవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల దాకా మంచు దుప్పట్లు తొలగట్లేదు. పెరుగుతున్న చలితో వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు ఉన్ని దుస్తులను ధరించడం కంటే మరో మార్గం కనిపించట్లేదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకినాడ నగరంతో పాటు సామర్లకోట పట్టణంలో పలు ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి. మధ్యప్రదేశ్, లూథియానా, సిమ్లా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ఉన్ని దుస్తులు తెచ్చి రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. రగ్గులు, చలికోట్లు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజ్‌లు, మఫ్లర్లు, తలపాగాలు రకరకాల సైజుల్లో రంగు రంగుల్లో లభిస్తున్నాయి. ధరలు అధికంగా వున్నా చిన్నారులతో పాటు పెద్దలు కూడా వాటిని కొనుగోలు చేస్తున్నారు.



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్ని దుస్తుల విక్రయం





మోడల్ మంకీ క్యాప్‌లు, హెడ్ బ్యాండ్‌లు



కాకినాడలో ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళ

ఎర్రజెండా ఒక్కటే రాజకీయ ప్రత్యామ్నాయం

- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో దేశ, రాష్ట్ర ప్రజలకు ఎర్రజెండా ఒక్కటే రాజకీయ ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడానికి ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నోట్ల రద్దు సమయంలో ప్రధాని మోదీ రూపాయి విలువపై ఘనమైన ఉపన్యాసాలు ఇచ్చారని, కానీ డాలర్‌తో పోల్చితే దారుణంగా పడిపోయిందన్నారు. దీని ప్రభావం, శ్రామికజనంపై ఎంత భారం పడుతుందో పార్లమెంట్‌లో ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకూ రూ.150 లక్షల కోట్లు అప్పులు చేసి అప్పుల భారతాన్ని సృష్టిస్తున్నారని, దీన్నుంచి బయట పడడానికి కులం, మతం, ప్రాంత వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ అంటూ గొప్పలు చెబుతున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఒక్క పెన్షన్లు తప్ప ఏం సాధించారని, నిరుద్యోగ భృతి, మహిళకు ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల 10న, వైద్య విద్య ప్రైవేటీకరణ నిరసిస్తూ 18న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. శతాబ్ది చరిత్ర నేపథ్యంలో 3,600 కమ్యూనిస్టు శాఖల్లో సీపీఐ ఆవిష్కరణ సభలు నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 5లక్షల మందిని సమీకరించి నూతన రాజకీయ ప్రత్యామ్నాయ దిశగా జనవరి 18న ఖమ్మంలో సీపీఐ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, పార్టీ పునర్వైభవం దిశగా, ప్రజలను భాగస్వాములు చేస్తూ, భవిష్యత్ పోరాటాలకు వేదిక చేసుకుంటామని ఈశ్వరయ్య పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్

- కొల్లాపూర్ శివాజీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సోంకవాడే
- నన్నయలో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్ కలిగిన దేశమని కొల్లాపూర్ శివాజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్‌జీ సోంకవాడే అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని రసాయనశాస్త్ర విభాగం, హైదరాబాద్‌లోని అయోంకి పబ్లిష్కో సంయుక్త ఆధ్వర్యంలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలు: వ్యవసాయ-ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్‌జీ సోంకవాడే ఆన్లైన్‌లో కీలక ఉపన్యాసం ఇచ్చారు. 67 శాతం యువత ఉన్న మన దేశంలో సాంకేతికపరమైన వినూత్న ఆలోచనలకు అవకాశాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఎలక్ట్రికల్ వాహనాలు ప్రమాదానికి గురికావడానికి యాంత్రిక ఒత్తిడి, ఉష్ణోగ్రత, తేమ, కలుషితాలు కారణమవుతున్నాయని చెప్పారు. ఉపయోగంలో లేని బ్యాటరీలను సరియైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని పర్యావరణ హితానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ విదేశాల నుంచి 300 మంది హాజరవుతున్నారని సదస్సు చైర్మన్, అయోంకి పబ్లిష్కో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ చంద్రమౌళి పావులూరి తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతలో వేగవంతమైన పురోగతులు, సహజ ప్రక్రియలపై అవగాహనను మరింత పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. సదస్సుకు సంబంధించిన వంద పరిశోధన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సదస్సు కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి, రసాయన విభాగాధిపతి కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



వేంకటేశ్వరస్వామి అన్నదానానికి విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్య అన్నదాన పథకానికి నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన ముళ్లపూడి వెంకటసుబ్బారావు- లక్ష్మి రజని, ముళ్లపూడి శివరామకృష్ణ-సాయిశృతి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

గ్రంథాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు వర్మ



జిల్లా కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కాకినాడ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీఆర్ఎస్‌హెచ్ వర్మ పేర్కొన్నారు. కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన ఉద్యోగుల సంఘం రెండో కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘంలో చేర్చుకునేందుకు తీర్మానం చేశారు. అలాగే సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు రేపాక వెంకటరావు, ప్రధాన కార్యదర్శి డొక్కా రాజు, సలాది సాయి సత్యనారాయణ, ములంపాక శ్రీనివాసరావు, జీవీవీఎస్ త్రినాథ్, కె.కిషోర్, కె.శ్రీనివాస్, సలాది రాజు, కె.పద్మజ, బి.రత్నమణి, బి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అక్నూ.. పీజీలో మిగిలిన సీట్లు

మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో మొదటి, రెండో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను మేనేజ్‌మెంట్ కోటా ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్లు భర్తీ చేసేందుకు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనుమతి ఇచ్చిందన్నారు. దీనిలో సెట్ అర్హత లేని, ఏపీ పీజీ సెట్-2025 పరీక్ష రాయని అర్హులైన అభ్యర్థులతో సీట్లు భర్తీ చేస్తామన్నారు. మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎమ్మెస్సీ మ్యాథ్స్ కోర్సుల్లో సీట్లు భర్తీ చేస్తామన్నారు. వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదన్నారు. ఇతర వివరాలకు 97018 27564 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు

రూ.1.5 లక్షల విరాళం

ద్రాక్షారామ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఇద్దరు దాతలు రూ 1.5 లక్షలు విరాళం సమకూర్చారు. ద్రాక్షారామకు చెందిన యనమండ్ర భీమశంకరం, మాణిక్యాంబ దంపతులు రూ.1 లక్ష, శ్రీదర్పసూర్య సుబ్రహ్మణ్యం రూ.50 వేలు విరాళం ఆలయ సహాయ కమిషనర్ ఏవీ దుర్గాభవానీకి అందజేశారు. దాతలకు ఆమె స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

12న ఉమ్మడి జిల్లా కార్మికుల సదస్సు



ఉమ్మడి జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న కాకినాడ వీఆర్ భవన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. గొల్లప్రోలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణదారుల నుంచి సెస్‌లు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించడం లేదని విమర్శించారు. కోట్లాది రూపాయిల క్లెయిమ్ బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షలు వంతున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిశెట్టి నూకరాజు, ఎం.గంగబాబు, చేదులూరి రత్నాజీ, మొగలి వరప్రసాద్, కోలా వీరబాబు, ఎస్.సత్తిబాబు, శ్రీను, నూకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'శంబాల..హర్రర్, సోషల్ ఫ్యాంటసీ సినిమా'



ఐఎస్‌టీఎస్‌లో సందడి చేస్తున్న సినీ నటులు

రాజానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హర్రర్, సోషల్ ఫ్యాంటసీ ఎలివేషన్లతో, మంచి కథతో శంభాల సినిమాగా మీ ముందుకు వస్తున్నామని హీరో ఆది అన్నారు. శంభాల మూవీ సినీ బృందం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ కళాశాలకు శుక్రవారం విచ్చేసింది. వారికి కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వెళ్లి సినిమా చూసి ఆదరించాలని కోరారు. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ ఈ నెల 25న శంభాల మూవీ విడుదల కాబోతుందని అందరూ తిలకించాలన్నారు. నటుడు ఇంద్రనీల్ ఈ సినిమాలోని డైలాగ్స్ చెప్తూ అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సినిమాలోని పలు పాటలకు స్టెప్పులు వేసి అలరించారు.

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖైదీల తరపున కోర్టులో ఉచితంగా వాదించడానికి న్యాయవాదుల సేవలు అవసరమైనా, బెయిల్ పిటిషన్లు దాఖలు, హైకోర్టుల్లో అప్పీలు వేయాల్సి ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. శుక్రవారం సెంట్రల్ జైలును ఆమె సందర్శించారు. ఆహార ప్రమాణాలు, వైద్య సేవలను, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి న్యాయ సహాయం గురించి వివరించారు. నిందితులు, ఖైదీల న్యాయ పరిరక్షణ కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

నేడు సామర్లకోటకు

సమాచార శాఖ కమిషనర్

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ శనివారం కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని డీఆర్వో జె.వెంకట్రావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈవో బళ్ల నీలకంఠం, పండితులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

చెస్‌లో రవిశంకర్ ప్రతిభ

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో రాజమహేంద్రవరానికి చెందిన వనం రవిశంకర్ 1506 ర్యాంకు సాధించాడని కోచ్ వరద సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ కుమారుడు సురేష్ చెస్ అకాడమీలో ఆరు నెలలుగా శిక్షణ పొందుతున్నాడని రవిశంకర్ తల్లిదండ్రులు తెలిపారు.

గాలికొదిలేశారు!

- మన్యంలో నీరుగారిన సత్యసాయి ఆశయం
- నిర్వహణా లోపంతో సత్యసాయి రక్షిత మంచినీటి పథకం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కేవలం 66 గ్రామాలకే అందుతున్న తాగునీరు



కుట్రవాడలో సత్యసాయి మంచినీటి పథకం (ఫైల్‌ఫొటో)

ప్రస్తుతం కళతప్పిన సత్యసాయి మంచినీటి పథకం

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

మన్యంలో గిరిజనుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు రక్షిత మంచినీటిని ప్రసాదించిన భగవాన్ సత్యసాయి ఆశయాలను గత కొన్నేళ్లుగా అధికారులు నీరుగారిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గిరిజన ప్రాంతాలు, పలు గ్రామీణ ప్రాంతాల్లోనూ రక్షిత మంచినీరు లేక ప్రజలు అనేక రోగాల బారినపడి ప్రాణాలను కోల్పోయే దుస్థితి ఉండేది. ఆ పరిస్థితులను తెలుసుకున్న భగవాన్ సత్యసాయి ఇక్కడి ప్రజలకు రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాలని నిశ్చయించిందే తడవుగా గోదావరి జలాల ఆధారిత పథకాన్ని పురుషోత్తపట్నంలో, పాములేరు ఆధారిత పథకాన్ని మారేడుమిల్లి మండలం కుట్రవాడలోనూ ఏర్పాటు చేసి 9 మండలాల్లో 212 గ్రామాల్లోని 2.20 లక్షల ప్రజల కోసం రక్షిత మంచినీటి సరఫరా అందించారు. 212 గ్రామాలకు ఈ రక్షిత మంచినీరు అందేవిధంగా సుమారు 550 కిలో మీటర్ల నిడివిన పైపులైన్లను నిర్మించి ఈ పథకాలను 2007 సెప్టెంబరులో ప్రభుత్వానికి సత్యసాయి సేవా సంస్థ అప్పగించింది. అప్పటిలో ఈ పథకాలను ఎల్‌అండ్‌టీ సంస్థే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది.

మొక్కుబడిగా...

కాగా సత్యసాయి జీవించి ఉన్నంతకాలం ఎంతో ప్రతిష్టాత్మకంగా నడిచిన ఈ పథకాల పట్ల తదనంతర కాలంలో ఆయా అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రస్తుతం కేవలం 66 గ్రామాలకే మొక్కుబడిగా తాగునీరు అందుతోంది. అది కూడా గతంలో మాదిరిగా శుద్ధికావడం లేదు. గిరిజనుల అభివృద్ధిని కాంక్షించే ఐటీడీఏ పూర్తిగా దీనిని పట్టించుకోవడం మానేసింది. వాగునీటిని క్లోరినేషన్, ఆలమ్, బ్లీచింగ్ మిశ్రమాలతో సక్రమంగా శుద్ధి చేసి లేబరేటరీలో పరీక్షించి మరీ నీటిని సరఫరా చేసే పద్ధతులు ప్రస్తుతం సక్రమంగా కొనసాగడం లేదు. కనీసం పథకాల భవనాలకు రంగులు కూడా వేయని దుస్థితి నడుస్తోంది. జిల్లా పరిషత్‌కు ఇష్టమైతే ఎవరో కాంట్రాక్టర్‌కు నిర్వహణ అప్పగించి ఊరుకోవడం మినహా ఇంతటి ఉత్తమ పథకాలను పరిరక్షించే చర్యలేవీ ఎవరూ తీసుకోవడం లేదు. సత్యసాయి ఆధ్యాత్మిక సేవలనే కాకుండా సమాజానికి హితమైన సేవలను అందించారంటూ ప్రత్యేక సమావేశాలు, ఉత్సవాలను నిర్వహించి కొనియాడే ఈ సందర్భంలోనైనా ఈ రక్షిత మంచినీటి పథకాలను పునరుద్ధరించే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. నిడదవోలుకు చెందిన మంత్రప్రగడ నాగేశ్వరరావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్న రాయుడు అశ్విక అండర్-11 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రుద్ర వైకుంఠరావు తెలిపారు. స్టేడియం కోచ్ కె.సంపత్‌కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారని కొనియాడారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అశ్విక ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా అండర్-17 విభాగంలో కె.కుమార్, చందు శ్రీధర్ రజత పతకాన్ని దక్కించుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. రోలర్ స్కేటింగ్ క్లబ్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఆర్.గిరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, కె.నరసింహమూర్తి, క్లబ్ సభ్యులు ఎస్.ప్రవీణ్, పీవీ సత్యనారాయణ, ఎస్.చిరంజీవి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వైకుంఠరావు

పనులు వేగంగా పూర్తి చేయాలి

- అన్నవరం దేవస్థానంలో సౌకర్యాల మెరుగుకు ప్రత్యేక సమావేశం
- కలెక్టర్ కార్యాలయానికి రావాలని అధికారులకు ఆదేశం
- సత్యదేవుడిని కుటుంబసభ్యులతో దర్శించిన కాకినాడ జిల్లా కలెక్టర్



అన్నవరం దేవస్థానం ఈవో, ఈఈలతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల అసంతృప్తి శాతం తగ్గించడం, మెరుగైన సౌకర్యాలక కల్పనకు ఏమి చేయాలనేదానిపై ఒకట్రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేద్దామని... ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఈవో ఇతర ముఖ్య అధికారులు కలెక్టర్ కార్యాలయానికి రావాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులతో సత్యదేవుడిని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం స్థానం నానాటికీ పడిపోతుందని ప్రత్యేక కార్యచరణ రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనం తరం దేవస్థానంలో ప్రసాద్‌స్కీం పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాద భవనం ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించగా ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. భక్తుల కోసం తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్ల ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని అన్నదాన భవనం నిర్మా ణం, మరుగుదొడ్ల ఏర్పాటు స్థలం చాలా దూరం కావడంతో మరోపక్క ఈ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ఈవో సుబ్బారావు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులువేదాశీర్వచనం అందించారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ దంపతులు

రైల్వేస్టేషన్లలో చోరీలు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

13.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, రూ.45వేల నగదు స్వాధీనం

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుని జీఆర్పీ పోలీసులు ప్రత్యేక రైడ్ నిర్వహించి పట్టుకున్నారు. కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న సేనాపతుల మనీష్, గుత్తుల వీరబాబును అదుపులోకి తీసుకున్నామని తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. విచారణ అనంతరం వారి నుంచి మోటార్‌సైకిల్, 13.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, రూ.45వేల నగదు స్వాధీనపరుచుకున్నారు.

నిందితులతో తుని రైల్వే పోలీసులు



అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



సత్యనారాయణ(ఫైల్)

ఆత్రేయపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా అదృశ్యమైన వ్యక్తి గోదావరిలో శవమై కనిపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పులిదిండికి చెందిన వల్లి సత్యనారాయణ(60) గత నెల 27న ఎవ్వరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ మనువడు చక్రి గతనెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిర్వహించారు. శుక్రవారం పేరవరం వద్ద గౌతమి గోదావరి నదిలో సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు వెళ్లి విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులపై కేసు

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్టు జగ్గంపేట ఎస్సై టీ.రఘునాధరావు తెలిపారు. గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ, డిగ్రీ కళాశాల సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురుని అదుపులోకి తీసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేదిలేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డివాములో మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

కపిలేశ్వరపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలోని వాకతిప్ప గ్రామశివారులో గురువారం రాత్రి గడ్డివాములో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం అంగర ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... వాకతిప్ప గ్రామశివారులో గడ్డివాము వద్ద గుర్తు తెలియని పురుష మృతదేహం ఉన్నట్టు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని సిబ్బందితో పరిశీలించినట్టు తెలిపారు. దీనిపై పక్క మండలాలకు సమాచారం ఇవ్వగా రామచంద్రపురం గ్రామానికి చెందిన గుబ్బల రమణ(59)గా గుర్తించారు. మృతుడు రామచంద్రపురంలోని ఓ ప్రైవేటు కాలేజీ నందు బస్సు క్లీనర్‌గా పనిచేసేవాడు. బస్సు కోరుమిల్లి గ్రామంలో ఉంచి అక్కడే నిద్రించేవాడు. గతనెల 27 నుంచి కనపించడంలేదు. అతడి చుట్టుపక్కల గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం రాత్రి గ్రామశివారులో డి.మణికంఠ పొలం గడ్డివాము దగ్గర రమణ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బావమర్ది గుత్తుల శ్యామ్ మృతదేహాన్ని రమణగా గుర్తించాడు. అనంతరం పోలీసులు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బాలికకు వేధింపులు...
ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు

రాజోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేశామని రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ గత పదేళ్లుగా తాటిపాకలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తుంది. ఆమెకు బాలిక ఉంది. అయితే ఆ మహిళతో రాజోలుకు చెందిన జీడీ ప్రసాద్ సహజీవనం చేస్తున్నాడు. ప్రసాద్ సదరు మహిళ కూతురి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో ప్రసాద్‌కు వారు దూరంగా ఉంటున్నారు. గత నవంబరు 2న ప్రసాద్ తన స్నేహితులైన సీహెచ్ రాంబాబు, కె.బాబి, ఎస్.అరుణ్‌తేజ, రామాంజనేయును వెంట తీసుకుని మహిళ ఇంటికి వెళ్లి బెదిరింపులకు గురిచేశారు. దీంతో ఆమె రాజోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఐదుగురిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు.

కులాన్ని మార్చేశారు...

కాకినాడకు చెందిన కానిస్టేబుల్ ఫిర్యాదు

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో తన కులాన్నే మార్చేశారని ఓ కానిస్టేబుల్ కలెక్టర్, డీఆర్వోలకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్లితే కాకినాడకు చెందిన జగదీష్ అనే కానిస్టేబుల్ తన కులాన్ని ఆన్‌లైన్‌లో కుట్రపూరితంగా మార్చేశారని అధికారులకు ఫిర్యాదు చేశాడు. డిబజీ సంతకాన్ని ఫోర్జరీ చేసి సస్పెన్షన్‌కు గురైన జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కామేశ్వరరావు కాకినాడ 32 ఏ సచివాలయ మహిళా వీఆర్వోతో కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని జగదీష్ ఆరోపించాడు. బీసీ కులస్తుడిగా ఉన్న తనను ఓసీ కులస్తుడిగా మార్చి తన ఉనికిని ప్రశ్నార్థకం చేశారని వాపోయాడు. సుమోటా కేస్ట్ సర్వేలో భాగంగా కుల పరిశీలన చేస్తున్న నేపథ్యంలో అదే అవకాశంగా సర్వేలో లొసుగులు వినియోగించుకుని తన కులాన్ని మార్చినట్టు పేర్కొన్నాడు. ఓటీపీ వస్తుందని ముందుగానే తెలిసి తొలుత తన ఫోన్ నెంబర్ మార్చి ఆపై కులం పేరు మార్చారన్నాడు. రెవెన్యూశాఖ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తక్షణం విచారణ చేపట్టాలని, తన కులాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించాడు. నేరానికి పాల్పడిన కామేశ్వరరావుతో పాటు సహకరించిన మహిళా వీఆర్వోపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరాడు.

సూక్ష్మ సింబల్... సూపర్!



అమలాపురం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు నేరుగా అందజేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సూక్ష్మాతి సూక్ష వస్తువుల తయారీ నిపుణుడు తాలాబత్తుల బ్రహ్మాజీ గ్లాసు గుర్తుపై పార్టీ సింబల్‌ను సూక్ష్మంగా తయారుచేశాడు. రోజు వ్యవధిలో 0.550 మిల్లీగ్రాముల వెండిని ఉపయోగించి సెంటీమీటరు ఎత్తు, 0.75 సెంటీమీటర్ల వెడల్పుతో సింబల్‌ను తయారుచేసినట్టు బ్రహ్మాజీ తెలిపారు. పార్టీ సింబల్‌పై జెండాను సైతం సూక్ష్మంగా చెక్కారు. త్వరలో పవన్‌ను కలసి సూక్ష్మ వస్తువును అందజేయనున్నట్టు తెలిపారు. బ్రహ్మాజీ ఇప్పటికే 37 సూక్ష్మ వస్తువులనుచేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పలు అవార్డులు, రికార్డులు దక్కించుకున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు యత్నం

లంకల గన్నవరంలో రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు లారీలు స్వాధీనం



పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ వద్ద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, చక్రలారీ



పి.గన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు కాలం ముగియడంతో తీరం వెంబడి ఇసుక, మట్టి తవ్వకాల కోసం మాఫీయా సిద్ధమవుతుంది. ఈ క్రమంలోనే డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైవి పాలెం దిగువున లంకల గన్నవరం పరిధిలో ఇసుక తవ్వకాలు నిమిత్తం ర్యాంపు ఏర్పాటుకు కొంతమంది మాఫీయా పెద్దలు శుక్రవారం రంగం సిద్ధం చేసుకుని బాట పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పి.శ్రీపల్లవి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో ఆర్ఐ డాంగే, సిబ్బంది బాట పనుల వద్దకు చేరుకుని రెండు ఎక్స్‌కవేటర్లు, చక్రముతో వచ్చిన 2 లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం యంత్రాలను పోలీసులకు అప్పగించామని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్పష్టం చేశారు. అలాగే మొండెపులంకలో రాత్రివేళల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలకు తమకు అనుమతులు ఉన్నాయని విజయవాడ నుంచి రాము పంపించారని బాట పనులు వద్ద ఉన్న కొంతమంది నిర్వహ కులు ఆర్ఐకు సూచించారు. దీంతో గోదావరి తీరాన్న పెద్దఎత్తున ఇసుకను తరలించేందుకు మాఫీయా పెద్దలు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. అలాగే రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా లంకలగన్నవరంలో బొండుఇసుక, మొండెపులంకలో ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. వారం వ్యవధిలో పోలీసులు 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించి పంపివేశారు.

కాకినాడలో 104 ఉద్యోగుల ఆందోళన



కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న 104 ఉద్యోగులు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 104 నిర్వహణ సంస్థ భవ్య యాజమాన్యం చట్టవ్యతిరేకంగా ఇచ్చిన షోకాజ్ నోటీస్‌ను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పిఠాపురం మండలం మల్లం పీహెచ్‌సి పరిధిలోని 104 వాహనంలో గత 6 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న రాంబాబును భవ్య యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా విధులకు సంబంధంలేని అంశాలపై ఆరోపణలు చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం కార్మిక చట్టాలకు విరుద్ధమని విమర్శించారు. భవ్య సంస్థ వచ్చాక వేతనాలను తగ్గించారని ఆరోపించారు. 104 వాహనాలు పూర్తిస్థాయిలో తిరగకపోయినా తిరుగుతున్నట్టు చూపించి ప్రభుత్వ నిధులు దోచుకుంటున్నారన్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి భవ్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకి యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రత్నరాజు,చీకట్ల శ్రీనివాస్ మద్దతు తెలిపారు.



వర్ణాల చిత్రం సూర్యోదయం వేళ ఆకాశం రంగుల వర్ణమైంది.. అందాల శోభ సంతరించుకుంది. కాకినాడ-పందూరు రహదారిపై కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కాకినాడ

పొదలాడలో కేడర్ విత్ లీడర్..

రాజోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొదలాడలోని జీఎస్ గార్డెన్స్‌లో కేడర్ విత్ లీడర్ కార్యక్రమాన్ని టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు.

విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- పాఠశాలల్లో పీటీఎం సమావేశాలు





అమలాపురం: విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, మామిడికుదురు: పెదపట్నంలంకలో సైన్సు ప్రదర్శనలు తిలకిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ముమ్మిడివరం: అయినాపురంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం

అమలాపురంరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యా శాఖ ఆధ్వర్యంలో పండుగలా మెగా పీటీఎం నిర్వహిస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగాపీటీఎంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతుంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థలోవినూత్న మార్పులు తీసుకువచ్చి విద్యాభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. సైకిల్ షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విద్యారంగంలో పెనుమార్పులు చేపట్టిందని ఎంఈవో డి.గౌరీశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం అయినాపురం హైస్కూలులో హెచ్ఎం జి.రామలక్ష్మి అధ్యక్షతన, కొమానపల్లిలో జడ్పీఉన్నత పాఠశాలలో హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు అధ్యక్షతన,కర్రివానిరేవు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.నాగరాజు అధ్యక్షతన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొమానపల్లిలో జరిగిన మెగా సమావేశంలో ఎంఈవో డి.గౌరీశంకర్ పాల్గొని మాట్లాడారు. ఆయాకార్యక్రమాల్లో సర్పంచ్ కాశి ఇందిర, స్కూలు మేనేజ్‌మెంట్ ఛైర్మన్ మారెళ్ల సూరిబాబు, ఎన్.రామారావు, అంబటి శివశంకరవరప్రసాద్, షేక్ సుభాన్, పెన్మెత్స కృష్ణవర్మ, ఎస్ఎన్ మునేశ్వరరావు, కర్రివానిరేవు పాఠశాలలో హెచ్ఎం ఎన్.నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్నాడ శివనాగరాజు సోదరులు విద్య మీద ఉన్న మక్కువతో విద్యార్థులకు ఐడీ కార్డులు అందించారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సదస్సులు నిర్వహించడంతో పాఠశాలల్లో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పి.గన్నవరం హైస్కూల్లో ప్రధానోపాధ్యాయిని కె.ఉమాదేవి ఆధ్వర్యంలో తొలుత విశిష్ట అతిథులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. ప్రభుత్వం విద్యాపరంగా చేస్తున్న అభివృద్ధి, సౌకర్యాలను ఐఎఫ్‌బీ ప్యానెల్స్‌లో వీడియోల ద్వారా చూపించారు. ఆర్ట్, సైన్స్‌కు సంబంధించి ప్రత్యేక గ్యాలరీని ఏర్పాటుచేసి ప్రదర్శన చేశారు. అలాగే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ భావాలను వ్యక్తపరిచారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. లంకలగన్నవరం మండల పరిషత్ పాఠశాలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. తహసీల్దార్ వి.రవికిరణ్ పరిశీలకుడుగా వచ్చారు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్చించారు. వీఎంసీ ఛైర్మన్ మల్లాడి నరసింహమూర్తి, హెచ్ఎం. ఎం.రామారావు, లంకే పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమాలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి. గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై హెచ్ఎంలు గోకరకొండ కనకదుర్గ, నూకల సత్యనారాయణ వివరించారు. రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, దాతలను సన్మానించారు.

మామిడికుదురు,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. పెదపట్నంలంక హైస్కూలు నిర్వహించిన మెగా టీచర్స్-పేరెంట్స్ మీట్ 3.0లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యలో రాణించడంతోనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుందని నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు ప్రాంతీయ విద్యా సంచాలకురాలు జి.నాగమణి అన్నారు. ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆమె పాల్గొన్నారు. ఫిజిక్స్ ల్యాబ్, బయాలజీ ల్యాబ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రయోగశాలలను పరిశీలించారు.విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం, ఎంఈవో వీధి సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ మమ్మీ, సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం, టీడీపీ మండలాధ్యక్షుడ సూరిబాబురాజు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 3.0కు ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మెగా పీటీఎం కార్యక్రమాలు మండలంలోని అన్ని పాఠశాలలో విజయవంతంగా నిర్వహించామని ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. శివకోడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మెగాపీటీఎం 3.0 ప్రిన్సిపాల్ టి.లలితకుమారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మెగా పీటీఎంకు గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ కడలి శ్రీదుర్గ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలో పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మెగా పీటీఎం సమావేశాలు ఘనంగా నిర్వహించారు. మేడిచర్లపాలెం మోడల్ ప్రైమరీ పాఠశాలలో పితారా కిట్‌ను ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి పరిశీలించారు. మెగా పీటీఎం సందర్భంగా వివిధ వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ 3.0 శుక్రవారం జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనా సామగ్రి, వృత్తి విద్యా సామగ్రి, గ్రంథాలయ పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పదో తగరతి పరీక్షల్లో 500పైబడి మార్కులు తెచ్చుకున్న 15 మంది విద్యార్థులకు సినీ నటి శాంతిరావు, దర్శకులు, నిర్మాత శేషసిందూరరావు, రాచకొండ ప్రభావతి సౌజన్యంతో విద్యార్థులకు రూ.25వేలు నగదు బహుమతిని పంపిణీ చేశారు.

ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన నీరు ఇవ్వాలన్నదే లక్ష్యం



రాజోలులో వాటరు ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం రాజోలులో మట్టపర్తి కాల్వగట్టు వినాయకుని గుడివంతెన వద్ద 40కేఎల్ వాటర్ ట్యాంకు, ఓల్డ్ బస్టాండు పెద్దింట్లమ్మ ఆలయం వద్ద 40 కేఎల్ వాటర్ ట్యాంకులకు ఎమ్మెల్యే దేవ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.1650కోట్ల సెంట్రల్ డెల్టా వాటర్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా రాజోలు నియోజకవర్గంలో అనేక వాటరు ట్యాంకులకు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, రాజోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీశ్వరి, దారపురెడ్డి బాబ్జి, కాట్నా రాజు, ఆరుమిల్లి సాయిబాబు, కుంపట్ల చిన్నారి పాల్గొన్నారు.

రూ.1650 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

మలికిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో మొట్టమొదటిగా రూ.1650 కోట్లతో సెంట్రల్ గ్రిడ్ మంచినీటి సరఫరాలో భాగంగా గుడిమెళ్లంక గ్రామంలో తాగునీటి ట్యాంకులకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. శాంతినగర్, మర్రిపేట ఏఏఎస్‌కాలనీ, మూలపోడులో 33 కేఎల్, 20కేఎల్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. ప్రతీ ఇంటికీ రోజు స్వచ్ఛమైన నీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఎన్డీఏ కూటమి నాయకులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్ పరిహారం ఇవ్వాలి

కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రికి సీఎం లేఖ

యానాం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజవర్గపరిధిలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ ఘటనలో 15కిలో మీటర్ల పరిధిలోని యానాంలో ఉన్న అన్నివర్గాల ప్రజలకు పరిహారం ఇవ్వాలని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హరదీప్‌ను ముఖ్యమంత్రి ఎన్.రంగసామి కోరారని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణరావు అన్నారు. ఈమేరకు సీఎం రాసిన లేఖను కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖా మంత్రి, ఇతర అధికారులకు మల్లాడి అందజేసి వాటికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఈసంఘనటతో అన్నివర్గాల ప్రజలకు జీవనోపాధి దెబ్బతిందన్నారు. ప్రమాద ఘటన జరిగిన ప్రాంతానికి 15కిలోమీటర్ల పరిధిలో నివశిస్తున్న చేపల వేట, అనుబంధ వ్యాపారాలపై పూర్తిగా ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజలకు, పాడైన చేపలు, రొయ్యల చెరువులకు, వ్యవసాయ భూములకు ఓఎన్జీసీ సంస్థ నెలవారిగా నిర్ణీత మొత్తాన్ని రెండేళ్లపాటు చెల్లించాలని సీఎం కోరారు. గ్యాస్ తవ్వకాలు జాతీయ ప్రాజెక్టు అయినందున బాధిత ప్రజలు కోరుకున్న విధంగా ప్రజలు ఇచ్చిన డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని సంబంధిత సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని పెట్రోలియం శాఖా మంత్రిని సీఎం కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు

ముమ్మిడివరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న వంచనకు గురైన మైనరు బాలిక విషయంలో నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకున్నామని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పేర్కొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను కూటమి నాయకులతో కలసి ఆయన పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, బద్రి రమా, గోదశి పుండరీష్ పాల్గొన్నారు.

గర్ల్స్ వైడ్ డెవలప్మెంట్ సభ్యుడి పరామర్శ..

గర్ల్స్ వైడ్‌డెవలప్మెంట్ సభ్యుడు ఎంఏకే భీమారావు శుక్రవారం గురుకుల పాఠశాల సిబ్బంది, పేరెంట్స్‌తో సమావేశమయ్యారు. జరిగిన దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపారన్నారు. ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సమగ్ర విచారణ నిర్వహించాలి

అఖిలభారత విద్యార్థి సమైక్య జిల్లా కార్యదర్శి రవికుమార్ శుక్రవారం బాధిత బాలికను పరామర్శించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో పెద్దఎత్తున విద్యార్థులను సమీకరించి నిరసన చేపడతామన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలపై అవగాహన సదస్సు

అమలాపురం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులు బయట పడుతుండడంతో శుక్రవారం అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూలులో విద్యార్థులకు కిమ్స్ వైద్య కళాశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి లక్షణాలతో పాటు నివారణోపాయాలను కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్ఆచార్య వివరించారు. చిగ్గర్ మైట్ పురుగు కాటు వల్ల తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పి, వికారం, వాంతులు, శరీరంపై దద్దుర్లు, అలసట తదితర లక్షణాలు సంభవిస్తాయన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కిమ్స్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ మస్కే విద్యార్థులు క్రీడా మైదానాల్లోను, తరగతి గదుల్లో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రేణుసులేఖ,డాక్టర్ ప్రీతమ్ తదితరులు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు.

ప్రతి రేషన్‌కార్డుకి రూ.3వేలు

యానాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత నెలలో వచ్చిన మొంథా తుపాన్‌తో మత్స్యకారులు, ప్రజలు నష్టపోయారు. తుపాన్ సహాయాన్ని పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటించిందని ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ప్రతీ రేషన్‌కార్డుదారుడికి రూ.3వేలు చొప్పున సహాయం ముఖ్యమంత్రి రంగసామి మాంజూరు చేసినట్లు మల్లాడి తెలిపారు. 15,497 రేషన్‌కార్డుల ఖాతాల్లో రూ.4.64కోట్లు జమ అవుతాయన్నారు.

మురమళ్లలో ప్రజాదర్బార్

ఐ.పోలవరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మురమళ్ళలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం టీడీపీ నాయకులు ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మాజీఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గుత్తుల సాయి, టీడీపీ మండల అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబు రాజు వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడతామన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలను అభివృద్ధి చేయాలి

ముమ్మిడివరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):ముమ్మిడివరంలోని డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి చేయాలని సీఐటీయూ నాయకులు నిమ్మకాయల వెంకటేష్, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కళాశాలలోని ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రశాంతికి వారు వినతిపత్రం అందజేశారు. ఈకళాశాలలో చదువుకునే వారంతా బడుగు, బలహీనవర్గాలు, కార్మిక, కర్షక వర్గాల పిల్లలేనని, వారికి మెరుగైన విద్యతో పాటు పరిశుభ్రతతో కూడిన ప్రశాంత వాతావరణం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు

సఖినేటిపల్లిలో పీటీఎం సమావేశం

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి రుద్రరాజు రామలింగరాజు మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య పాల్గొన్నారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించి వారికి అభినందనలు తెలిపారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం స్కూలు పిల్లలు, విద్యార్థులు అమూల్యను సన్మానించారు. స్కూలు కమిటీ ఛైర్మన్ కొండా కిశోర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంఈవో డి.కిశోర్‌కుమార్, హెచ్ఎం కోలా వీరస్వామి, తాడి సత్యనారాయణ పాల్గొన్నారు. మెగా పీటీఎం కార్యక్రమాలు అంతర్వేదిదేవస్థానం, గొంది, అంతర్వేది, కేశవదాసుపాలెం, మోరి తదితర పాఠశాలల్లో నిర్వహించారు.

కోలుకుంటున్న ఎస్పీఎఫ్ హెచ్‌సీ

పని ఒత్తిడి కాదు



అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్పీఎఫ్ హెచ్‌సీ ప్రసాద్

అల్లవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద డ్యూటీలో ఉండగా గుండెపోటు వచ్చిన ఏపీ ఎస్పీఎఫ్ 1503 హెడ్ కానిస్టేబుల్ ఏఎస్ఆర్కే ప్రసాద్ ప్రస్తుతం కోలుకుని అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈనెల3న తనకు గుండెపోటు రాగా ఎస్పీఎఫ్ అధికారులు సుమంత్, నదీమ్‌లు తనను హుటాహుటిన దగ్గరుండి అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారని, తాను ప్రస్తుతం కోలుకుంటున్నట్టు హెచ్‌సీ ప్రసాద్ అన్నారు. ఏవిధమైన పని ఒత్తిడి లేదని, తనకు స్ట్రోక్ రావడంతో ఆసుపత్రికి తరలించారన్నారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిపై ఎస్పీఎఫ్ ఉన్నతాధికారులు ఆరా తీశారు. తమ ఎస్పీఎఫ్ సిబ్బందికి అధికారుల వేధింపులు లేవని, విధి నిర్వహణలో పని ఒత్తిడి కూడా లేదని ఎస్పీఎఫ్ సిబ్బంది అన్నారు. కిమ్స్ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెచ్‌సీ ప్రసాద్‌ను ఎస్పీఎఫ్ సీఐ రంజిత్‌కుమార్, ఎస్ఐ శ్రీరామ్‌లు, ఏఎస్ఐలు, ఎస్పీఎఫ్ సిబ్బంది ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి నిలకడా ఉందని ఆందోళన చెందనవసరం లేదని సీఐ రంజిత్‌కుమార్ అన్నారు.

మతం సత్ప్రవర్తనకు బాట వేయాలి

ఉప్పలగుప్తం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మతం మానవతకు, సత్ప్రవర్తనకు దారి చూపాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి సీఎస్ఎం జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం రాత్రి జరిగిన ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు టీకేవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, సొసైటీ ఛైర్మన్ మంచెం బాలకృష్ణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్, కార్యదర్శి డీఆర్ఎస్ శాస్త్రి, సంయుక్త కార్యదర్శి ఎల్.డేవీడ్, కోశాధికారి జె.ఇస్సాకు, గౌరవాధ్యక్షులు టి.శరత్‌బాబు, ఎన్.ఏసురత్నం, జి.బాలరాజు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

మామిడికుదురు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్న బి.దొడ్డవరానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆకుమర్తి వెంకటదుర్గాప్రసాద్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.8,35,514 చెక్కును ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం బాధిత కుటుంబానికి అందించారు. జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత దేశంగా నిర్మించాలి

ముమ్మిడివరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 2030నాటికి దేశాన్ని బాల్య వివాహాల రహిత దేశంగా నిర్మించాలనే సంకల్పంతో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ వంద రోజుల కార్యక్రమాన్ని చేపట్టిందని అలెర్ట్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వైఎల్ జయరాజ్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో శుక్రవారం వారు విద్యార్థినులు, ఆశకార్యకర్తలతో అవగాహన సదస్సు, ర్యాలీ చేపట్టారు. ప్రత్యేక ప్రచార రథాన్ని ఏర్పాటుచేసి జిల్లా వ్యాప్తంగా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

'గిరిబాబును టీడీపీ నుంచి సస్పెండ్ చేశాం'

కాట్రేనికోన, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కాట్రేనికోనలో ఆయన స్వగృహం వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముమ్మిడివరం బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఒక విద్యార్థినిని పల్లంకుర్రుకు చెందిన మోకా గిరిబాబు అపహరించి, అత్యాచారం చేయడంపై కూటమి ప్రభుత్వం కేసు నమోదు చేసిందన్నారు. నిందితుడికి పార్టీ సభ్యత్వం ఉన్నంత మాత్రాన ఉపేక్షించేది లేదని, అందుకే పోలీసు కేసు పెట్టామన్నారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు ఆదేశాలతో గిరిబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసి, పార్టీ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఈవిషయంలో ప్రతిపక్షం అనవసరంగా రాద్ధాంతం చేస్తోందన్నారు.టీడీపీ మండలాధ్యక్షుడు చెల్లి సురేష్, మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, కాలాడి వీరబాబు, అంగాని నరసింహమూర్తి, బొంబాయి వీరబాబు, రేవు వెంకటరమణ పాల్గొన్నారు.

స్థానికులకు ఐస్‌బాక్సులు అందించాలి: ఎమ్మెల్యే



మత్స్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):మత్స్యశాఖ ద్వారా ఐస్‌బాక్సులను స్థానికులకు అందించాలని మత్స్యశాఖాధికారులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీని వాస్ అశోక్ సూచించారు. స్థానికులకు ఇవ్వకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇస్తున్నారని పలువురు మత్స్యకారులు ఎమ్మెల్యే గొల్లపల్లికి మొరపెట్టుకున్నారు. దీంతో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణం వారికి ఐస్‌బాక్సులు కేటాయించాలని ఎమ్మెల్యే సూచించారు. రెండో విడతలో వారికి మంజూరు చేస్తామని అధికారులు చెప్పారు. గ్రామాల్లోమత్స్యకారుల సమస్యలపై వారు చర్చించారు.

విద్యా కమిటీ ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యా అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కొత్తలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్‌గా జైను లక్ష్మణకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. డైరెక్టర్లగా మోకా రాజు, దొంగ గోపాలకృష్ణ, మట్టపర్తి లక్ష్మి ఎంపికయ్యారు. ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ గీసాల దుర్గాచంద్రరావు, వీపూరి నాగరాజు, గుత్తుల మల్లికార్జునరావు, తోలేటి రాంబాబు, నడిమింటి సూర్యప్రభాకరం, దాసరి గంగాధరరావు, జంగారెడ్డి రమేష్, దూడల స్వామి, బీర శివ, మట్టా గోవిందు, వంగా తులసీరామ్, నందూరి బుజ్జి, సామంతకుర్తి సుబ్బారావు, పోతిశెట్టి సత్యనారాయణలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లవరంలో మెగా పేరెంట్స్ మీట్

అల్లవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అల్లవరం జడ్పీహైస్కూలులో శుక్రవారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ శుక్రవారం ఘనంగా జరిగింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం విద్యార్థుల బంగారు భవితకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు.

అప్రమత్తతో సైబర్ మోసాలకు అడ్డుకట్ట: సీఐ

అమలాపురం టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముందస్తు అవగాహనతోనే సైబర్ మోసగాళ్ల వలకు చిక్కకుండా జాగ్రత్త పడవచ్చునని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు పేర్కొన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే అనవసర లింకుల జోలికి వెళ్లవద్దని ఆయన సూచించారు. అమలాపురం విద్యానిధి డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణను విద్యార్థులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కేఎం జోషి, విద్యాసంస్థల ఛైర్మన్ ఏబీ నాయుడు, ప్రిన్సిపాల్ బి.సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నివాసప్రాంతాల మధ్య మురుగునీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు వ్యాప్తి చెందిన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడతారని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. పుల్లేటికుర్రు మార్కెట్‌పాలెంలో డెంగ్యూ నిర్ధారణ అయిన ప్రాంతాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు.అక్కడఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే చిరతపూడిలో ఆయన పర్యటించారు. వైద్యాధికారి కె.సుమప్రియ, డాక్టర్ టి.దివ్య శ్రీ, సీహెచ్ఎం ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఈనెల6న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పగిలిన పైపులైన్లు

- వృథాగా పోతున్న తాగునీరు
- అధికారుల పర్యవేక్షణ కరువు



నార్కెడిమిల్లి వద్ద వృథాగా పోతున్న తాగునీరు

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంక మెగా వాటర్ ప్రాజెక్టు నుంచి శుద్ధి చేసిన గోదావరి జలాలు గ్రామాలకు సరఫరా చేస్తున్న పైపులైన్లు పగిలి తాగునీరు వృథాగా పోతుంది. శుద్ధిచేసిన తాగునీటి జలాలు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిత్యం గ్రామాల్లో ఏదొక ప్రాంతంలో పైపులైన్లు పగిలి నీరు వృథాగా పోతుంది. నార్కెడిమిల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద శుద్ధిచేసిన తాగునీటి జలాలు పైపులైన్ పగిలి వృథాగాపోతుంది. ప్రజలకు తాగునీరు అంతంత మాత్రంగానే అందుతోంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. అధికారులు చర్యలు చేపట్టాలి గ్రామస్థులు కోరుతున్నారు.

పంటలకు నీటి సరఫరాపై ఆర్డీవో సమీక్ష



నీటి సంఘాలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో 2025-26 రబీ సీజన్‌లో పంటలకు నీటి సరఫరా, వినియోగం పై శుక్రవారం కొత్తపేట ఆర్డీవో అధ్యక్షతన నీటి సంఘాలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటకాలువలపై ఉన్న సమస్యలను తెలుసుకుని ఇంజనీరింగ్ అధికారుల నుంచి నివేదికలు తీసుకున్నారు. ఈ నివేదికల ఆధారంగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సమావేశంలో కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని గోపాలపురం, అవిడి, గన్నవరం, అయినవిల్లి, ఆలమూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, నీటి సంఘాల అధ్యక్షులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రమేష్‌కుమార్

రాయవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగించడంవల్ల నేలలు దెబ్బతినే అవకాశం ఉంటుందని అవసరానికి మించి ఎరువులను వాడరాదని మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పసలపూడి గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవం, భూమాత రక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగుచేసిన పంటల్లో పురుగు మందులు అవశేషాలు తక్కువగా ఉండి ఆర్యోగానికి మేలు చేస్తుందన్నారు. ప్రతి రైతు కనీసం 10 నుంచి 20 సెంట్ల భూమిలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో పసలపూడి సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ సత్తి వెంకటకృష్ణారెడ్డి, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రిలయన్స్ క్విజ్ పోటీల్లో

ద్రాక్షారామ విద్యార్థినికి తృతీయస్థానం



రిలయన్స్ క్విజ్ పోటీలలో ప్రతిభ చాటిన వానపల్లి విద్యార్థులు

ద్రాక్షారామ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):రిలయన్స్ ఇండస్ట్రీస్ కాకినాడ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన దీరూబాయ్ అంబానీ జిల్లాస్థాయి క్విజ్‌పోటీల్లో ద్రాక్షారామ సూర్య ఇంగ్లీషు మీడియంకు చెందిన తలాటం శ్రీమహిమాన్విత, శాలా పూజిత ప్రభలు తృతీయస్థానం సాధించారు. విద్యార్థినులకు అసిస్టెంటు కలెక్టర్ శ్రీమనీష సైకిళ్లు, స్కూల్ బ్యాగ్, మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. రిలయన్స్ సైట్ హెడ్ ఎల్.మురళీధర్ పాల్గొన్నారు

వానపల్లి విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దీరూభాయ్ అంబానీ రిలయన్స్ క్విజ్ పోటీలలో వానపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినీలు పి.శరణ్య, టి.ప్రణీతలు విజేతలుగా నిలిచారు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారులు వీరికి ప్రశాంస పత్రాలు, సైకిళ్లు బహూకరించారు. వీరిని వానపల్లి సర్పంచ్ పల్లి భీమారావు, విద్యాకమిటీ ఛైర్మన్ అద్దంకి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

బెతెస్థలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బేతస్థ ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను పాస్టర్ ఎన్‌వీ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కేకును కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థన మందిరంలో క్రీస్తు భక్తులు ఆలపించిన క్రీస్తు గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాస్టర్ ఎన్‌వీ రావ్ బైబిల్ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అన్నారు. క్రీస్తు మార్గమే శిరోధార్యంగా భావించే క్రీస్తు భక్తులు ఆయన ఇచ్చిన సందేశాలను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ సోదరుభావంతో మెలగాలి అన్నారు. నాయకులు కార్యకర్తలు క్రీస్తు భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం రాయవరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించినట్లు ఎస్టీయూ సీనియర్ నేత యాకల విశ్వేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ ఈసమావేశంలో ఎస్టీయూ నూతన అధ్యక్షుడిగా లచ్చిరెడ్డి సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడిగా దేవరకొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా రాయవరపు విజయభాస్కర్, ఆర్థిక కార్యదర్శిగా పంపన వీరవెంకటరమణ, జిల్లా కౌన్సిలర్‌గా యాకల విశ్వేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పడాల ఈశ్వరరెడ్డి, అభయ్, కన్వీనర్‌గా మల్లేశ్వరపు రామకృష్ణలను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్టీయూ సంఘ సభ్యులు బండారు శ్రీనివాస్, వి.రాధాకృష్ణ, వెలగల భామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈకార్యక్రమంలో తమలంపూడి ఈశ్వరరెడ్డి, భామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): :సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలవద్ద నుంచి 238 వినతులు స్వీకరించి వాటిని పరిష్కారానికి సత్వరమే ఆయా అధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేయడంతోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కె.గంగవరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 11కేవీ అండర్ పీడర్‌మీద చెట్టు కొమ్మలు తొలగింపు ప్రక్రియ చేపట్టిన కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, దీని కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విద్యారంగంలో సంస్కరణలు తెచ్చిన

కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే వేగుళ్ల
- ఘనంగా పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే



మండపేట మండలం ఏడిదలో మెగా పేరెంట్స్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు, ద్వారపూడిలో విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లను అందిస్తున్న తులా కృష్ణ





రాయవరం హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల





ఆలమూరులో విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీడీవో రాజు, రామచంద్రపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

రాయవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టడం ద్వారా విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం విప్పర్తి శాంతి సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ ఒక క్లిష్టతరమైన బాధ్యతకాగా మంత్రి నారా లోకేష్ విద్యాశాఖను తాను తీసుకుంటానని చెప్పి బాధ్యతలు చేపట్టి అనేక సంస్కరణలు తీసుకువస్తూ విద్యార్థులకు మంచి భవిష్యత్తును కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఎమ్మెల్యే స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడంతో పాటు, విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన డ్రాయింగ్‌ను ఆసక్తిగా తిలకించారు. మండలంలోని 12 గ్రామాల్లో ఉన్న 34 ప్రాథమిక, 4 యూపీ, 8ప్రైమరీ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణ మూర్తి, తహశీల్దారు భాస్కర్, ఎంఈవో వైసూర్యనారాయణ, టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు, పీఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, ఐటీడీపీ నేత దొంతంశెట్టి బాల కేదారీశ్వరుడు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భావిభారత సమాజాన్ని తీర్చిదిద్దాలి

- కొత్తపేట ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): భావిభారత సమాజాన్ని తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ మీట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పాల్‌ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లు విద్యాభివృద్ధిపై చూపుతున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, ఛైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవర్తనను గమనించాలి: ఆర్డీవో

రామచంద్రపురం(ద్రాక్షారామ),(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చదువుతోపాటు విలువలు ముఖ్యమని విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని ఆర్డీవో అఖిల పేర్కొన్నారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులుజాతీయోన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ సంక్షేమ పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్‌డే వేడుకల్లో ఆర్డీవో అఖిల, వాసంశెట్టి సత్యం పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా పట్టణంలో పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు.

ద్రాక్షారామలో: రామచంద్రపురం మండలంలో అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌డే నిర్వహించారు. హసన్‌బాద జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో జెడ్పీమాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ఎంపీటీసీ వై.దేవి తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు. మండలంలో అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు ఆలమూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీ డీవో ఎ.రాజు, కొత్తపేట రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్‌తోపాటు పలువురు సభ్యులు పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తున్నామని, వీటిని తల్లిదండ్రులు గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఎంపీడీవో రాజు సూచించారు. మండలంలో చెముడులంక, మూలస్థానం, జొన్నాడ, సంధిపూడి, నర్సిపూడి, ఆలమూరు జెడ్పీహైస్కూల్స్‌లో పీటీఎం మీటింగ్‌లు ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోండి

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ పంపన నాగమణి, తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం పామర్రు జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం, ఉచితంగా యూనిఫాంలు, విద్యాకిట్‌లు, విదేశీవిద్య రుణాలు వంటి పథకాలు గురించి వివరించారు. సత్యవాడ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ సురేంద్రరెడ్డి, కోటిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ఏ.నాగరాజు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యకోసం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, చిట్టూరి రామ్మోహన్‌రావు, రమణమూర్తి, జానకి రామయ్య, నున్న సత్యనారాయణ, చీకట్ల సోమేష్, ప్రిన్సిపాల్ బి.చంద్రశేఖర్, కళాశాల లెక్చరర్స్ జి.వి.వి.వెంకటరమణ, సలాది శ్రీరామచంద్రమూర్తి, సురేష్, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంతోపాటు మండలంలంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ వేడుకలను నిర్వహించారు. రూరల్ అర్బన్స్‌లోవున్న 68 పాఠశాలల్లో వేడుకలను నిర్వహించామని మండల విద్యాధికారులు నాయుడు రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి తెలిపారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ప్రజాప్రతినిధులు వేడుకలకు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేసిన సాంస్కృతిక వేడుకలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మండపేట మండలం ద్వారపూడిలో వున్న జిల్లాపరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పరీక్షల అట్టలు, పెన్నులు గ్రామానికి చెందిన యువనేత తులా కృష్ణ అందించారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు ప్రసాదరావు, సత్యనారాయణలు పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. 42 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, 8 జడ్పీ హైస్కూల్స్‌లో, ఎయిడెడ్ పాఠశాలలో మెగా పీటీ ఎంకు తల్లిదండ్రులు పాల్గొని ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం విద్యార్థుల అభివృద్ధిపై అనేక అంశాలపై చర్చించారు. డొక్కా మధ్యాహ్న భోజనపథకం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలోని ప్రభుత్వ కళాశాలలు, అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు అంశాల పై విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు తల్లిదండ్రుల పట్ల ఏవిధంగా మెలగాలి తదితర అంశాలను వారికి వివరించారు. కళాశాల, పాఠశాలల ఛైర్మన్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం 3.0 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగర, కపిలేశ్వరపురం, టేకి, వల్లూరు, కాలేరు, తదితర పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన చర్యలను, పాఠశాల విద్యార్థుల ప్రగతిని, పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులను, మూల్యాంకన పుస్తకాలు గూర్చి ఉపాధ్యాయులు వివరించి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు కె.తాతారావు, విజయకుమార్, వివిధశాఖల ఉద్యోగులు, సిబ్బంది, పీఎంసీ ఛైర్మన్‌లు, సభ్యులు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణంతో

24 గంటల విద్యుత్ సాధ్యం: ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకిగ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా మండల ప్రజలకు 24గంటలు విద్యుత్ సౌకర్యం కలుగుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని టేకి గ్రామంలో రూ.2కోట్ల62 లక్షలతో నిర్మించనున్న 33బై11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామసర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల జనవరి 9న మంత్రిచే సబ్‌స్టేషన్ ప్రారంభించేలా నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ నిర్మాణంతో మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కారం కానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, టీడీపీ సీనియర్ నాయకుడు దాసరి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సొసైటీ అధ్యక్షులు, పలువురు ప్రజాప్రతినిధులు, మండలానికి చెందిన కూటమి నాయకులు, గ్రామస్థులు, తదితరులు, విద్యుత్‌శాఖ జీఎం వెంకటేశ్వరరావు, డీఈ టి.విజయానంద్, ఈఈ కె.రత్నాలరావు, ఏడీఈ ఎస్. శ్రీనివాసరావు, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ సత్యనారాయణ, రమేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బండారు

- నియోజకవర్గ అభివృద్ధిపై వినతి



సీఎం చంద్రబాబును కలిసిన కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీ, సిబ్బంది కొరతపై చర్చించారు. ఆత్రేయపురం మండలంలోని సాగునీటి సరఫరా నిరంతరం కొనసాగించేందుకు ఉచ్చిలి, వసంతవాడ పంపింగ్ స్కీ మ్‌లు పునరుద్ధరణ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారు తెలిపారు.

సీఎం చిత్రపటానికి దివ్యాంగుల పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకంచేస్తున్న దివ్యాంగులు

ద్రాక్షారామ, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సీ ఎం చంద్రబాబు దివ్యాంగులకు ఏడు వరాలు ప్రకటించిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ద్రాక్షారామ బోసుబొమ్మసెంటర్‌లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని సీఎం చంద్రబాబు దివ్యాంగులకు వరాలు ప్రకటించడం పట్ల దివ్యాంగులు హక్కుల వేదిక హర్షం వ్యక్తం చేసింది. జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు ఆధ్వర్యం లో సీఎంచంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మేడపాటి పాపిరెడ్డి, కొండలరావు, రవి, బుంగ సత్తిబాబు, పువ్వల ప్రసాద్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల ఆందోళన విజయవంతం చేయాలి

ద్రాక్షారామ, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగుల దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి ఈనెల 6 నుంచి చేపట్టిన ఆందోళన విజయవంతం చేయాలని సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు పెంకె సత్యనారాయణ కోరారు. ఈనెల నుంచి సహకార సంఘాల ఉద్యోగులు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టామన్నారు. 6న నల్లబాడ్జీలతో విధులకు హాజరు, 8న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డీసీసీబీ బ్రాంచిల ఎదుట ఉద్యోగుల ధర్నా, 16న జిల్లా సహకార కార్యాలయాల వద్ద ధర్నా, 22న డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నా, 29న విజయవాడలో ధర్నా చౌక్‌లో మహాధర్నా, జనవరి 5 నుంచి విజయవాడ ధర్నా చౌక్‌వద్ద రిలే నిరహార దీక్షలు చేపడతామన్నారు. జీవో 36 అమలుచేయాలని, గ్యాట్యుటీ యాక్టు ప్రకారం అమలుచేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులు సర్వీసు క్రమబద్దీకరించాలని, సంఘాలకు షేరు ధనంపై ఇవ్వాల్సిన 6శాతం డెవిడెంట్, వడ్డీ చెల్లించాలని, సహకార సంఘాలు లాభనష్టాలతో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకు చేపట్టిన అందోళనలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాయకులు పదవులకు రాజీనామా చేసి ప్రజల్లోకి రావాలి

- అఖిలపక్ష జేఏసీ డిమాండ్

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో కలపాలని ప్రజాభీష్టం ప్రకారం అఖిలపక్ష జేఏసీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా నియోజకవర్గానికి చెందినప్రజాప్రతినిధులు రాజీనామాలుచేసి పాల్గొనాలని అఖిలపక్ష జేఏసీ నాయకుడు మాగాపు అమ్మిరాజు కోరారు. శుక్రవారం స్థానిక చెలికాని రామారావు స్మారకభవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడారు. ప్రజల అభీష్టం మేరకు జేఏసీ తరపున పోరాటం చేస్తుంటే నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు నోరు మెదకపోవడం విచారకరమన్నారు. నియోజకవర్గానికి చెందిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మంత్రి వాసంశెట్టి సుభాష్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తమ పదవులకు రాజీనామాచేసి కాకినాడ జిల్లాలో రామచంద్రపురం నియోజవర్గం విలీనం చేసేందుకు ప్రజల్లోకి రావాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 30వరకు అభ్యంతరాలు తెలియచేసేందుకు అవకాశం ఉందని నాయకులు కలసి రావాలని కోరారు. సమావేశంలో పట్టణ గొల్లపల్లి కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు, మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, సీపీఐ నాయకులు పెద్దిరెడ్డి రాము, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, వెంటపల్లి బీమశంకరం పాల్గొన్నారు.

మండపేట నియోజకవర్గం విలీనంపై హర్షం



మండపేట నియోజకవర్గం తూర్పులో విలీనంపై హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంపట్ల మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీం సాహెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అంగరలో హర్షం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. .